ప్రజాశక్తి
బుధవారం 7 ఫిబ్రవరి 2024
5
శ్రీకాకుళం

కౌంటింగ్ కేంద్రం పరిశీలన

ఎచ్చెర్ల : సాధారణ ఎన్నికలకు కౌంటింగ్ కేంద్రంగా నిర్ణయించిన మండలంలోని చిలకపాలెంలో గల శ్రీశివానీ ఇంజినీరింగ్ కళాశాలల భవనాలను కలెక్టర్ మనజీర్ జిలాని సమూన్, ఎస్పి జి.ఆర్ రాధికతో కలిసి మంగళవారం పరిశీలించారు. ఎన్నికల సంఘం మార్గదర్శకాల మేరకు ముందస్తుగా కళాశాలలోని అన్ని బ్లాకుల గదులను, వాటి విస్తీర్ణాన్ని పరిశీలించారు. పోలింగ్ అనంతరం నియోజకవర్గాల వారీగా ఇవిఎంలు భద్రపరచడానికి స్ట్రాంగ్‌రూమ్‌లను గుర్తించారు. ఈ కేంద్రంలో 24 గంటలూ అప్రమత్తంగా ఉండేలా సిసి కెమెరాల నిర్వహణ, నిరంతరం విద్యుత్ ఇంటర్నెట్ సౌకర్యం గురించి సూచనలు చేశారు. గతంలో ఇదే కళాశాలలో నిర్వహించిన కౌంటింగ్ ఏర్పాట్లకు సంబంధించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జెసి ఎం.నవీన్, ఆర్‌డిఒ సిహెచ్.రంగయ్య, కళాశాల యాజమాన్య ప్రతినిధులు డి.వెంకట్రావు, రాజు తదితరులు పాల్గొన్నారు.

సాగునీటికి సహకారం అందేనా?

- నిధుల కొరతతో సతమతమవుతున్న సాగునీటి ప్రాజెక్టులు
- గత బడ్జెట్‌లో కేటాయింపులు జరిగినా విడుదల కాని నిధులు
- కొత్త పథకాలు, ప్రాజెక్టులపై జిల్లావాసుల ఎదురుచూపులు
- నేడు అసెంబ్లీలో ఓటాన్ అకౌంట్ బడ్జెట్

నిధుల కొరతతో జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు ముందుకు సాగని పరిస్థితి నెలకొంది. గత బడ్జెట్‌లో నిధులు కేటాయించిన ప్రభుత్వం, ఆ మేరకు నిధులు కేటాయించలేదు. ట్రిపుల్ ఐటి, బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీలకూ నిధుల కొరత వెంటాడుతోంది. వైసిపి ప్రభుత్వం పెట్టే ఆఖరి బడ్జెట్ ఇదే కావడంతో ప్రస్తుత ఓటాన్ అకౌంట్ బడ్జెట్‌లో జిల్లాకు కేటాయింపులపై జిల్లావాసులు ఆశగా ఎదురుచూస్తున్నారు.

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

జిల్లాలో సాగునీటి ప్రాజెక్టులు నిధుల కోసం ఎదురుచూస్తున్నాయి. వంశధార ప్రాజెక్టు ఫేజ్-2 స్టేజ్-2కు అంచనా వ్యయం రూ.2407.79 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.1987.53 కోట్లు ఖర్చు చేశారు. నిర్మాణ పనులు, భూ సేకరణకు కలిపి మరో రూ.420 కోట్లు ఇస్తే ప్రాజెక్టు పనులు పూర్తవుతాయని అధికారులు చెప్తున్నారు. 87 ప్యాకేజీ పనులు 90 శాతం, 88 ప్యాకేజీ పనులు 94 శాతం పూర్తి కాగా, హిరమండలం రిజర్వాయర్ పనులు 95 శాతం మేర పూర్తయ్యాయి. వంశధార, నాగావళి నదుల అనుసంధానం పనులను 2017, మార్చిలో రూ.85 కోట్లతో పరిపాలనా అనుమతులు ఇచ్చారు. ప్రాజెక్టు పూర్తికి కావాల్సిన మేర నిధులు విడుదల చేయకపోవడంతో ప్రస్తుతం దాని అంచనా వ్యయం రూ.145.34 కోట్లకు చేరింది. ఇందులో ఇప్పటివరకు రూ.105.81 కోట్లు ఖర్చయింది. ఇప్పటివరకు 80 శాతం పనులు పూర్తయ్యాయి. భూసేకరణకు రూ.8.26 కోట్లు చెల్లించాల్సి ఉంది. ఆఫ్‌షోర్ రిజర్వాయర్ ప్రాజెక్టు అంచనా వ్యయం రూ.852 కోట్లు కాగా, ఇప్పటివరకు రూ.325 కోట్లు ఖర్చు చేశారు. భూసేకరణకు సంబంధించి రూ.7.04 కోట్ల చెల్లింపులు పెండింగ్‌లో ఉన్నాయి.

సాగునీటి ప్రాజెక్టులకు ప్రతిపాదనలు ఇలా...

వంశధార స్టేజ్-2 ఫేజ్-2 పనులకు రూ.393.92 కోట్లు అవసరమని అధికారులు ప్రతిపాదనలు పంపారు. వంశధార-1 ప్రాజెక్టు నిర్వహణ పనులకు రూ.1.45 కోట్లు కావాలని అడిగారు. మడ్డువలస రిజర్వాయర్ నిర్వహణ, రెండో దశ పనులకు రూ.30 కోట్లు చొప్పున ప్రతిపాదనలు పంపారు.

కరకట్టల పనులకు నిధులు దక్కేనా?

కరకట్టల నిర్మాణానికి పెద్దఎత్తున భూమిని సేకరించాల్సి ఉండడం, భూసేకరణకు అధికంగా నిధులు వెచ్చించాల్సి రావడంతో ప్రభుత్వం 2019లో ఉన్నపళంగా కరకట్టలను రద్దు చేసింది. అత్యంత ప్రమాదరకరమైన ప్రాంతాల్లో వరద గట్ల నిర్మాణాలకు ప్రతిపాదనలను పంపాలని అధికారులకు సూచించింది. జిల్లాలో ఆ విధంగా ఉన్న ప్రాంతాలను గుర్తించిన అధికారులు నాలుగేళ్లుగా ప్రతిపాదనలు పంపుతూనే ఉన్నారు. నాగావళి కరకట్టలకు సంబంధించి అధికారులు మొత్తం రూ.37.65 కోట్లతో ప్రతిపాదనలు పంపారు. వంశధార నదీ పరివాహక ప్రాంతంలో 22.77 కి.మీ మేర కరకట్టలను నిర్మించేందుకు రూ.77.60 కోట్లతో ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపారు.



ట్రిపుల్ ఐటిని వెంటాడున్న మౌలిక వసతులు

ఎచ్చెర్లలోని ట్రిపుల్ ఐటికి సొంత గూడు లేక విద్యార్థులు అవస్థలు పడుతున్నారు. ఆరు వేల మంది విద్యార్థుల వసతికి అవసరమైన భవనాలు, మౌలిక వసతుల కల్పనకు రూ.600 కోట్లు కావాల్సి ఉంది. శివానీ ఇంజినీరింగ్ కళాశాలకు చెందిన భవనాలను నెలకు రూ.ఆరు లక్షలకు అద్దెకు తీసుకుని తరగతులు నిర్వహిస్తున్నారు. 2023-24 బడ్జెట్‌లో ట్రిపుల్ ఐటికి రూ.32 కోట్లు కేటాయించినా, పూర్తిస్థాయిలో ప్రభుత్వం నిధులు విడుదల చేయలేదు.

మూలపేట పోర్టుకు ఏమేర నిధులు కేటాయిస్తారో?

మూలపేట పోర్టుకు ప్రభుత్వం బడ్జెట్‌లో రూ.వంద కోట్లను కేటాయించింది. పునరావాసం, పరిహారం చెల్లింపులకు నిధులు అవసరం ఉన్న నేపథ్యంలో పోర్టుకు ఈ బడ్జెట్‌లో ఎంతమేర నిధులు కేటాయిస్తుందో వేచిచూడాలి.

అంబేద్కర్ యూనివర్సిటీ నిధులు కేటాయింపు జరిగేనా?

ఎచ్చెర్లలోని బి.ఆర్ అంబేద్కర్ యూనివర్శిటీని నిధుల కొరత వెంటాడుతోంది. పరిపాలనా భవనం పూర్తయినా పురుషుల వసతిగృహ నిర్మాణాలు పెండింగ్‌లో ఉన్నాయి. రూ.53.70 కోట్లతో అంచనాలు రూపొందించినా, నిధుల్లేక ప్రతిపాదనల దశలోనే ఉండిపోయాయి. బోధన, బోధనేతర సిబ్బంది పోస్టులు ఖాళీగానే ఉన్నాయి.

నిధుల్లేక అడుగు పడని ఫిషింగ్ హార్బర్ పనులు

ఎన్నికల నేపథ్యంలో ఎచ్చెర్ల మండలం బుడగట్లపాలెంలో ప్రతిపాదిత ఫిషింగ్ హార్బర్‌కు నిధులు కేటాయింపులు ఉండొచ్చని అధికారులు భావిస్తున్నారు. మూలపేట పోర్టు పనులు చకచకా సాగుతుంటే, దాంతోపాటే శంకుస్థాపన చేసిన ఫిషింగ్ హార్బర్ పనులు ఒక్క అడుగూ ముందుకు పడలేదు. హార్బర్ నిర్మాణానికి ఇప్పటికే కేంద్ర ప్రభుత్వం అన్నిరకాల అనుమతులు ఇచ్చింది. హార్బర్ నిర్మాణం పూర్తయితే వేలాది మంది మత్స్యకారులకు ఉపాధి లభిస్తుందని అధికారులు చెప్తున్నారు.

ఒప్పంద జిఒలను విడుదల చేయాలి

నగరపాలక సంస్థ కార్యాలయం వద్ద కార్మికుల ధర్నా

ధర్నా చేస్తున్న మున్సిపల్ కార్మికులు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

రాష్ట్ర ప్రభుత్వం మున్సిపల్ కార్మికుల సమ్మె సమయంలో ఒప్పందంలో అంగీకరించిన మేరకు జిఒలు వెంటనే విడుదల చేయాలని, లేకుంటే పోరాటాన్ని ఉధృతం చేస్తామని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి పి.తేజేశ్వరరావు, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎన్.బలరాం, ఉపాధ్యక్షులు ఎ.గణేష్ ప్రభుత్వాన్ని హెచ్చరించారు. సమ్మె కాలపు ఒప్పంద జిఒలు జారీ చేయడంలో ప్రభుత్వ అలసత్వాన్ని నిరసిస్తూ ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఆధ్వర్యాన నగరపాలక సంస్థ కార్యాలయం ఎదుట మంగళవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సందర్భంగా 16 రోజుల సమ్మె కాలపు ఒప్పందాల జిఒలు జారీ చేయాలని డిమాండ్ చేశారు.

ఇంజినీరింగ్ కార్మికుల స్కిల్డ్, సెమీస్కిల్డ్ జీతాల సమస్యపై ఏర్పాటు చేసిన కమిటీ నివేదికను వెల్లడించాలన్నారు. క్లాప్ డ్రైవర్ల సమస్యలపై నెలాఖరులోపు జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేస్తామని అంగీకరించినా ఇంతవరకు కార్యరూపం దాల్చలేదన్నారు. ఇప్పటివరకు మినిట్స్ కాపీతో పాటు సంక్రాంతి కానుక రూ.వెయ్యి, సమ్మె కాలపు జీతం చెల్లింపునకు సంబంధించిన జిఒలు మాత్రమే విడుదల చేశారని చెప్పారు. అందులోనూ ఎన్ఎంఆర్, కోవిడ్, వరదలు, కొత్తగా తీసుకున్న కార్మికులు, క్లాప్ డ్రైవర్లకు సమ్మె కాలపు జీతాలు చెల్లించాలని జిఒలో పేర్కొనకపోవడం వల్ల స్థానిక మున్సిపల్ అధికారులు వీరికి సమ్మె కాలం జీతాలు చెల్లించడానికి నిరాకరిస్తున్నారని తెలిపారు. క్లీన్ ఎన్విరాన్‌మెంట్ వర్కర్స్‌కు సంబంధించి రూ.21 వేలు, శానిటేషన్ డ్రైవర్లు, అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ కార్మికులకు రూ.24,500, విలీన గ్రామ పంచాయతీ కార్మికులను మున్సిపల్ కార్మికులుగా గుర్తించి రూ.21 వేలు జీతం, పిఎఫ్, ఇఎస్ఐ, రిటైర్మెంట్ బెనిఫిట్ రూ.75 వేలు, దహన సంస్కారాలకు రూ.20 వేలు, సాధారణ మృతికి రూ.రెండు లక్షలు, ప్రమాద మృతులకు రూ.ఐదు లక్షల నుంచి ఏడు లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు. పర్మినెంట్ సిబ్బందికి సంబంధించి రూ.20 కోట్లకు పైగా బకాయి ఉన్న సరెండర్ లీవులు చెల్లింపులు, జిపిఎఫ్ అకౌంట్లు ప్రారంభం, క్లీన్ ఎన్విరాన్‌మెంట్ వర్కర్లకు సంబంధించి సంక్షేమ పథకాల అమలు తదితర జిఒలను జారీ చేయాలన్నారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు ఆర్.ప్రకాష్, మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ నాయకులు సిహెచ్.మురుగన్, పి.బాలకృష్ణ, కె.వెంకటి, ఎ.శంకర్, ఎన్.పార్వతి, ఆరుద్రమ్మ తదితరులు పాల్గొన్నారు.

జిల్లా పంచాయతీ అధికారిగా వెంకటేశ్వరరావు

శ్రీకాకుళం ప్రతినిధి : జిల్లా పంచాయతీ అధికారి (డిపిఒ)గా టి.వెంకటేశ్వరరావును నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ప్రస్తుతం ఆయన విశాఖ జిల్లా గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్‌గా పనిచేస్తున్నారు. ఆయన 2008 నుంచి 2013 వరకు డిపిఒగా ఇక్కడ పనిచేశారు. ఇప్పటివరకు జిల్లా పంచాయతీ అధికారిగా పనిచేస్తున్న రవికుమార్‌ను కోనసీమ జిల్లా డ్వామా ఎఒగా నియమించింది. ఈయన 2019 ఆగస్టులో జిల్లాకు వచ్చారు. కొత్తగా నియమితులైన డిపిఒ వెంకటేశ్వరరావును గిరిజన సంక్షేమశాఖ రిలీవ్ చేసిన తర్వాత రవికుమార్ కోనసీమ వెళ్లనున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

చేర్పుల దరఖాస్తులపై నిశిత పరిశీలన

కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఓటర్ల చేర్పులకు వచ్చే దరఖాస్తులను నిశితంగా పరిశీలించాలని కలెక్టర్ మనజీర్ జిలానీ సమూన్ అధికారులను ఆదేశించారు. సార్వత్రిక ఎన్నికలకు సంబంధించి జాయింట్ కలెక్టర్ ఎం.నవీన్‌తో కలిసి కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మంగళవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నోడల్ అధికారులు ముందస్తు రోడ్ మ్యాపును తయారు చేయాలన్నారు. ఫారం-6, 8 దరఖాస్తులను సత్వరమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పోలింగ్ కేంద్రాల వారీగా పరిశీలించాలని చెప్పారు. చేర్పులు ఎన్ని, తొలగింపులు ఎన్ని వివరంగా ఉండాలని సూచించారు. ఫిబ్రవరి 15 నాటికి పెండింగ్‌లో ఉన్న డూప్లికేట్, మరణించిన, తదితర వాటిని సవరించి పూర్తి చేయాలన్నారు. పోలింగ్ కేంద్రాల వద్ద మౌలిక సదుపాయాలు తక్షణమే పూర్తి చేయాలని ఆదేశించారు. ఫిర్యాదులపై స్పందించి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు.

పోలింగ్ కేంద్రాల వారీగా గతంలో ఎంతెంత పోలింగ్ శాతం జరిగిందో చూసి, తక్కువ పోలింగ్ శాతం జరిగిన చోట పోలింగ్ శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. సమావేశంలో టెక్కలి సబ్ కలెక్టర్ నూరుల్ కమర్, అసిస్టెంట్ కలెక్టర్ రాఘవేంద్ర మీనా, ఇన్‌ఛార్జి డిఆర్ఒ రామ్మోహనరావు, ఆర్‌డిఒలు భరత్ నాయక్, సిహెచ్.రంగయ్య, డిటిసి చంద్రశేఖర్ రెడ్డి, ఉప కలెక్టర్ అప్పారావు, డిఆర్‌డిఎ, డ్వామా పీడీలు విద్యాసాగర్, చిట్టిరాజు, జెడ్‌పి సిఇఒ వెంకట్రామన్, పలువురు అధికారులు, తహశీల్దార్లు, ఎన్నికల డిటిలు పాల్గొన్నారు.

ఓటర్ల జాబితాలో అక్రమాలు

- కొత్తూరులో ఒడిశా వాసుల ఓట్లు
- ఎన్నికల సంఘానికి ఫిర్యాదు చేసినా ఫలితం శూన్యం
- ఓట్ల అక్రమ నమోదుపై న్యాయస్థానాన్ని ఆశ్రయిస్తాం
- మాజీ ఎమ్మెల్యే కలమట వెంకటరమణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

ఒడిశా రాష్ట్రానికి చెందిన వందలాది ఓట్లు పాతపట్నం నియోజకవర్గ ఓటర్ల జాబితాలో చేర్చి విడుదల చేశారని మాజీ ఎమ్మెల్యే, పాతపట్నం నియోజకవర్గ టిడిపి ఇన్‌ఛార్జి కలమట వెంకటరమణ అరోపించారు. నగరంలోని టిడిపి జిల్లా కార్యాలయంలో మంగళవారం విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పాతపట్నం నియోజకవర్గం పరిధిలోని కొత్తూరు మండలం బూత్ నంబరు 202లో ఓటర్ల జాబితాలో 81 ఓట్లు స్థానికులవి కావని, ఒడిశాకు చెందిన వారి పేర్లు నమోదు చేశారని చెప్పారు. గతంలో జిల్లాకు స్పెషల్ ఎలక్ట్రోరల్ స్పెషల్ ఆఫీసర్‌గా వచ్చిన శ్యామలరావుకు ఫిర్యాదు చేశానని, ఆయన గత కలెక్టర్‌తో సహా కిందిస్థాయి అధికారులందరికీ దీనిపై విచారణ చేయించాలని ఆదేశించినా వాటిని తొలగించలేదన్నారు. అధికార పార్టీ నాయకులకు అనుకూలంగా ఒడిశా ఓటర్లను బంధుత్వం పేరుతో హిరమండలం ఓటర్ల జాబితాలో చేరుస్తున్నారని తెలిపారు. ఒడిశాకు చెందిన నాగమణి, విశ్వనాథం దంపతులకు పాతపట్నం ఓటరు జాబితాలో చేర్చారని చెప్పారు. ఓట్ల అక్రమ నమోదులో ఎన్నికల సంఘం కూడా విఫలం కావడంతో న్యాయస్థానాన్ని ఆశ్రయించనున్నట్లు తెలిపారు. హిరమండలం జెడ్‌పిటిసి పొగిరి బుచ్చిబాబు మాట్లాడుతూ హిరమండలం మేజర్ పంచాయతీలోని బూత్ నంబరు 303లో 262 ఓట్లు అక్రమంగా నమోదు చేశారని తెలిపారు. తమ గ్రామానికి సంబంధం లేని వారిని, మరణించిన వారిని సైతం ఈ జాబితాలో చేర్చడం అధికారుల నిర్లక్ష్యానికి అద్దం పడుతోందన్నారు. ఎల్ఎన్‌పేట మండలానికి చెందిన కొందరి పేర్లను హిరమండలంలో చేర్చారన్నారు. రెండు చోట్ల ఓట్లు ఉండడంపై ఇఆర్ఒ, ఎఇఆర్‌లకు లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేసినా ఫలితం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. సమావేశంలో టిడిపి నాయకులు తేజేశ్వరరావు, వి.సూరిబాబు తదితరులు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వెంకటరమణ

రేపట్నుంచి న్యాయవాదుల విధులు బహిష్కరణ

బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు

ప్రజాశక్తి - శ్రీకాకుళం

ఆంధ్రప్రదేశ్ భూ హక్కు చట్టం-2022కు వ్యతిరేకంగా ఈనెల 8 నుంచి 16వ తేదీ వరకు న్యాయవాదులు కోర్టు విధులు బహిష్కరిస్తున్నట్లు బార్ అసోసియేషన్ అధ్యక్షులు ఎన్ని సూర్యారావు తెలిపారు. నగరంలోని బార్ అసోసియేషన్ భవనంలో సర్వసభ్య సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సమావేశంలో విధుల బహిష్కరణపై ఏకగ్రీవ తీర్మానం చేశారు. విధుల బహిష్కరణ సమయంలో న్యాయవాదులు ఏరకమైన దావాలు, సెషన్స్ కేసులు, బెయిల్, ఇతరత్రా విచారణలు చేపట్టరాదని నిర్ణయించారు. పబ్లిక్ ప్రాసిక్యూటర్లు, గవర్నమెంట్ ప్లీడర్లు ఈ సమయంలో సాక్షులను ప్రవేశపెట్టకుండా ఉండాలని తీర్మానించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి పొన్నాడ రాము, ఉపాధ్యక్షులు జి.చంద్రమోహన్, బార్ కౌన్సిల్ సభ్యులు గేదెల వాసుదేవరావు, పొన్నాడ వెంకట రమణరావు, కూన రాజారావు, కె.సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలకు లోబడి నిర్మాణాలు

అసిస్టెంట్ సిటీ ప్లానర్ వరహాలబాబు

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

శ్రీకాకుళం నగర పరిధిలో భవన నిర్మాణదారులు ప్రభుత్వ నిబంధనలకు లోబడి నిర్మాణాలు చేపట్టాలని అసిస్టెంట్ సిటీ ప్లానర్ (ఎసిపి) వి.వరహాలబాబు స్పష్టం చేశారు. శ్రీకాకుళం నగరపాలక సంస్థ కార్యాలయంలో ఎసిపిగా మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 35 ఏళ్ల సర్వీసులో పలు హోదాల్లో అనేకచోట్ల విధులు నిర్వహించినట్లు చెప్పారు. శ్రీకాకుళం కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ స్థలాలను కబ్జా చేస్తే కమిషనర్ ఆదేశాల మేరకు వెంటనే చర్యలు చేపడతామన్నారు. ప్లాన్లకు విరుద్ధంగా నిర్మాణాలు చేపడితే వారికి తొలి దశలోనే నోటీసులు అందజేసి అక్రమ నిర్మాణాలను తొలగించనున్నట్లు తెలిపారు. నిబంధనలు అతిక్రమిస్తే క్రిమినల్ చర్యలు తప్పవని హెచ్చరించారు. నగర ప్రజల సహకారంతో సుందర శ్రీకాకుళం నిర్మాణంలో ప్రతిఒక్కరూ భాగస్వామ్యం కావాలని పిలుపునిచ్చారు.

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మాజీ ఎంపీ హర్షకుమార్ తదితరులు

11న దళిత సింహగర్జన

మాజీ ఎంపీ జి.వి హర్షకుమార్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

దళితుల సమస్యలపై ఈనెల 11న రాజమహేంద్రవరంలోని వేమగిరిలో దళిత సింహగర్జన సభను నిర్వహిస్తున్నట్లు మాజీ ఎంపీ జి.వి హర్షకుమార్ తెలిపారు. నగరంలోని అంబేద్కర్ విజ్ఞాన్ మందిర్‌లో దళిత సింహగర్జన పోస్టర్‌ను దళిత సంఘాల నాయకులతో కలిసి మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దతులను విస్మరించే ప్రభుత్వాలకు గుణపాఠం తప్పదని హెచ్చరించారు. వైసిపి ప్రభుత్వం దళిత సంక్షేమాన్ని విస్మరించిందన్నారు. రావాలి జగన్ అన్న చోటే పోవాలి జగన్ అన్న పరిస్థితిని జగన్ తెచ్చుకున్నారని తెలిపారు. దళితుల నోట్లో మట్టి కొట్టారని మండిపడ్డారు. దళితుల సంక్షేమానికి ప్రవేశపెట్టిన 25 పథకాలను ఏకపక్షంగా రద్దు చేసి నియంత అనిపించుకున్నారని ధ్వజమెత్తారు. వచ్చే ఎన్నికల్లో ఓటుతోనే జగన్‌కు బుద్ధిచెప్పాలన్నారు. దళితుల ఐక్య పోరాటంతోనే ప్రభుత్వం దిగి వస్తుందని, దళిత సింహగర్జన సభను జయప్రదం చేసి సత్తా చాటాలన్నారు. సమావేశంలో దళిత సంఘాల నాయకులు డాక్టర్ గంజి ఎజ్రా, భరత్ భూషణ్, పి.దుర్గారావు, మురళీకృష్ణ, బి.అప్పారావు, బోసు మన్మథరావు తదితరులు పాల్గొన్నారు.

10 కేజీల గంజాయి పట్టివేత

నలుగురు అరెస్టు

ప్రజాశక్తి - పలాస

పలాస నుంచి తమిళనాడుకు తరలిస్తున్న పది కేజీల గంజాయిని కాశీబుగ్గ పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. గంజాయిని విక్రయిస్తున్న ఒడిశా రాష్ట్రం పర్లాకిమిడికి చెందిన నాగ అప్పారావు, కొనుగోలు చేసిన తమిళనాడు రాష్ట్రం తిరుచిరాపల్లిలోని వల్లకుండికి చెందిన రాజారాంపాల్, లతాపాల్ రాజ్, రాధామాతి వనంను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను కాశీబుగ్గ పోలీస్‌స్టేషన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఎస్ఐ పారినాయుడు తెలిపారు. పర్లాకిమిడికి చెందిన అప్పారావు గంజాం జిల్లా జురంగో ప్రాంతంలో గంజాయి సాగు చేస్తూ విక్రయిస్తున్నాడు. 15 రోజుల కిందట 15 కేజీల గంజాయిని పలాసకు తీసుకొచ్చి విక్రయించాడు. గంజాయి కోసం తమిళనాడుకు చెందిన రాజారాంపాల్, లతాపాల్ రాజ్, రాధామాతి వనం ఫోన్‌లో నాగరాజును సంప్రదించాడు. ఈనెల 6వ తేదీన కాశీబుగ్గ సాయిరాం ఆలయం వద్దకు వస్తే గంజాయి ఇస్తానని చెప్పడంతో, వారు మంగళవారం వచ్చారు. రహస్య సమాచారాన్ని అందుకున్న పోలీసులు కాశీబుగ్గ సిఐ ఎన్.హెచ్.బి ఆనంద్ ఆధ్వర్యాన ప్రత్యేక బృందంగా ఏర్పడి ఆలయం వద్దకు చేరుకున్నారు. గంజాయి చేతులు మారుతున్న సమయంలో దాడి చేసి పది కేజీల గంజాయిని స్వాధీనం చేసుకున్నారు. నలుగురిని అరెస్టు చేసి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

మాట్లాడుతున్న ఎస్ఐ పారినాయుడు

రిజిస్ట్రేషన్ ప్రక్రియ వేగవంతం

శ్రీకాకుళం కార్పొరేషన్ కమిషనర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పట్టాల రిజిస్ట్రేషన్‌ను వేగవంతం చేయాలని శ్రీకాకుళం నగరపాలక సంస్థ కమిషనర్ తమీమ్ అన్సారియా ఆదేశించారు. స్థానిక చంపాగల్లి వీధి వార్డు సచివాలయాన్ని మంగళవారం సందర్శించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను పరిశీలించారు. సాంకేతికపరమైన ఇబ్బందులను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం పేదల ఇళ్ల పట్టాలను ఉచితంగా రిజిస్ట్రేషన్ చేస్తోందని, క్షేత్రస్థాయిలో ఇబ్బందుల్లేకుండా ప్రక్రియను వేగవంతం చేయాలన్నారు. సాంకేతిక సమస్యలు ఉంటే జిల్లా రిజిస్ట్రార్‌తో సమన్వయం చేసుకోవాలని సూచించారు.

జెడ్‌పి సిఇఒగా వెంకటేశ్వరరావు బాధ్యతల స్వీకరణ

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

జిల్లాపరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారిగా డి.వెంకటేశ్వరరావు జెడ్‌పి కార్యాలయంలో మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. విజయనగరం జిల్లా బొబ్బిలి భూసేకరణ డిప్యూటీ కలెక్టర్‌గా పనిచేసిన ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా జెడ్‌పి సిఇఒగా నియమితులయ్యారు. ఇంతవరకు జెడ్‌పి సిఇఒగా బాధ్యతలు నిర్వర్తించిన ఆర్.వెంకట్రామన్ డిప్యూటీ సిఇఒగా కొనసాగుతున్నారు. బాధ్యతల స్వీకరణ అనంతరం కవిటి మండలం బల్లిపుట్టుగలోని జెడ్‌పి ఛైర్‌పర్సన్ పిరియా విజయను ఆమె క్యాంపు కార్యాలయంలో మర్యాద పూర్వకంగా కలిశారు.

IN THE HONOURABLE COURT OF THE
4TH ADDITIONAL DISTRICT JUDGE CUM
SC&ST COURT AT SRIKAKULAM
OS No 31//2022

BETWEEN:
GOLIVI BHADRAMMA@BHAVANI ... Plaintiff
AND
SADHU VENKATAPPADU AND 44 OTHERS ...DEFENDANTS

NOTICE TO DEFENDANT NO:6
DANDA TRIVENI W/o Padaga Haribabu, Age :44years, hindu DNo:1-15, Main street, mulakam@Jadapeta village, Tandyam post, ponduru manadalam, Srikakulam district.

NOTICE
పై నెంబర్ దావా లో మీకు ఎన్నిసార్లు నోటీసు పంపినా తీసుకొనక కాలయాపన చేయుచున్నందున మహారాజశ్రీ 4వ అదనపు జిల్లా జడ్జి cum SC&ST కోర్టు శ్రీకాకుళం వారి ఆర్డర్ ప్రకారం ఈ ప్రకటన ద్వారా మీకు తెలియజేయడమైనది. సదరు దావా లో మీకు ఎటువంటి అభ్యంతరములు వున్నా స్వయంగా గాని, అడ్వకేట్ గారి ద్వారా గాని తేది 19.02.2024 న ఉదయం గం.10.30ని. పై కోర్టు వారి ఎదుట హాజరై, మీకు గల అక్షేపణలు తెలియపరచు కోవలెను లేనియడల మీ పరోక్షమున తీర్మానించెదరని ఇందుమూలంగా మీకు తెలియజేయడ మైనది.

N. విజయకుమార్
V.S. శ్రీనివాసరావు
A. అప్పలరాజు
అడ్వకేట్స్, శ్రీకాకుళం.

కర్రసాము పోటీల్లో ప్రతిభ

శ్రీకాకుళం అర్బన్ : నెల్లూరులో ఈనెల 4న జరిగిన మొదటి సౌత్ ఇండియా కర్రసాము పోటీల్లో శ్రీకాకుళం క్రీడాకారులు సబ్ జూనియర్ విభాగంలో పాల్గొని పసిడి పథకాలు కైవసం చేసుకున్నారు. శ్రీకాకుళం డిస్ట్రిక్ట్ కర్రసాము అసోసియేషన్ కార్యదర్శి కె.తారకరామ మాట్లాడుతూ ప్రాచీనకళల్లో భాగమైన కర్రసాము కళను ప్రోత్సహించేందుకు నెల్లూరులో చిల్డ్రన్ పార్క్‌లో నిర్వహించారని తెలిపారు. మొదటి సౌత్ ఇండియా పోటిల్లో రుప్ప నరేంద్ర నాయుడు, బగ్గు హర్షవర్ధన్ పాల్గొని ఒంటి కర్ర సాము, రెండు కర్రల సాము, ఒంటి కర్ర యుద్ధం విభాగల్లో నాలుగు పసిడి పథకా లు, ఒక రజితం, ఒక కాంస్య పథకాలను కైవసం చేసుకున్నారు. గెలుపొందిన విజేతను కర్ర సాము ఫెడరేషన్ అఫ్ ఇండియా అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు కె.శ్రీహరి, .శ్రీనివాస రావు, రాష్ట్ర కర్రసాము అసోసియేషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ భాస్కరరావు, డిస్ట్రిక్ట్ వుషు అసోసియేషన్ కార్యదర్శి శివకుమార్, క్రీడాకారులు, క్రీడాభిమానులు అభినందనలు తెలిపారు.

రెండో రోజు పెన్షనర్ల రిలే నిరాహార దీక్ష

శ్రీకాకుళం అర్బన్ : ఇపిఎస్ పెన్షనర్లకు కనీస పెన్షన్ రూ.9వేలు, కరువు భత్యం ఇవ్వాలని డిమాండ్ చేస్తూ ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ ఆధ్వర్యాన నగరంలోని జ్యోతిరావు పూలే పార్కు వద్ద మంగళవారం రెండో రోజు రిలేనిరాహార దీక్ష చేపట్టారు. దీక్ష శిబిరాన్ని ఎల్ఐసి రిటైర్డ్ ఉద్యోగుల జిల్లా అధ్యక్షులు కె.నారాయణ ప్రారంభించారు. అనంతరం శిబిరంలో ఆల్ పెన్షనర్స్ అండ్ రిటైర్డ్ పర్సన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్ష కార్యదర్శులు దొంతం పార్వతీశం, మణికొండ ఆదినారాయణమూర్తి హాజరై మాట్లాడారు. అతి తక్కువ పెన్షన్‌తో తీవ్ర ఇబ్బందులు పడుతున్న ఇపిఎస్ పెన్షనర్లకు కేంద్ర ప్రభుత్వం న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. దేశవ్యాప్తంగా సుమారు 70 లక్షల మంది ఇపిఎస్ పెన్షనర్లలో సుమారు 80శాతం మందికి నెలకు కనీస పెన్షన్ రూ.2వేలు మించి రావడం లేదని, వీరిలో సగం మంది పెన్షన్ రూ.వెయ్యిలోపు మాత్రమే చెల్లిస్తున్నారన్నారు. సరాసరి పెన్షన్ రూ. 1482 మాత్రమే వస్తోందని, పెన్షనర్లకు కరువు భత్యం ఇవ్వడం లేదన్నారు. బిజెపి ఎన్నికలకు ముందు తమ మేనిఫెస్టోలో కనీస పెన్షన్ రూ.3వేలు, కరువు భత్యం ఇస్తామని హామీ ఇచ్చారని, అధికారంలోకి వచ్చిన తర్వాత హామీని నెరవేర్చకుండా పెన్షనర్లకు అన్యాయం చేశారన్నారు. సుప్రీంకోర్టు పెన్షన్ పెంపుదలకు అనుకూల తీర్పు ఇచ్చినా అమలు చేయడం లేదన్నారు. గతంలో ఇచ్చే రేల్వే రాయితీని పునరుద్ధరించడంతో పాటు పెన్షన్ లెక్కింపులో ప్రోరేటా పద్ధతిని రద్దు చేయాలన్నారు. దీక్షలో కె.వి.ఆర్ మూర్తి, పి.వాసుదేవరావు, జి. రాజారావు, బి.వెంకటరావు, పైడి గోపాలరావు, ఇతర పెన్షనర్లు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దీక్షా శిబిరం

రక్షణ గోడ నిర్మాణంలో అవకతవకలు

పలాస: మండలం లొత్తూరులో ఐటిడిఎ నిధులతో చేపట్టిన రోడ్డు నిర్మాణంలో భాగంగా రక్షణ గోడ నిర్మాణంలో అవకతవకలు జరిగాయని ప్రజావేదికలో సోషల్ ఆడిట్ బృందం బయట పెట్టింది. స్థానిక ఆర్‌డబ్ల్యుఎస్ కార్యాలయ ఆవరణలో మంగళవారం ఎన్ఆర్ ఇజిఎస్ ఆధ్వర్యంలో 2022-23 ఏడాదిలో జరిగిన పనులపై ప్రజావేదిక నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా డ్వామా పిడి జి.వి.చిట్టి రాజు పాల్గొన్నారు. లొత్తూరులో ఐటిడిఎ నిధులతో చేపట్టిన రోడ్డు రక్షణ గోడ నిర్మాణంలో తేడా ఉన్నట్లు గుర్తించి రూ.1.30 లక్షలు రికవరీకి పిడి ఆదేశించారు. 19 పంచాయతీల్లో మస్టర్లపై సంతకాలు లేకుండా ఉపాధి కూలీలకు బిల్లులు చెల్లించినట్లు సోషల్‌ఆడిట్‌లో గుర్తించామని స్టేట్ రిసోర్స్‌పర్సన్ వెంకటరావు ప్రజావేదిక దృష్టికి తీసుకువచ్చారు. 2022-23 ఏడాదిలో రూ.8.65 కోట్ల వ్యయంతో ఉపాధిహామీ పథకం ద్వారా చెరువులు, కాలువలు, నీటి గుంటలు, రోడ్లు, సిసి రోడ్లు, సచివాలయాలు, రైతు భరోసా కేంద్రాలు నిర్మాణం చేపట్టినట్లు ప్రజావేదిక దృష్టికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా డ్వామా పిడి చిట్టిరాజు మాట్లాడుతూ ప్రతిఒక్కరికి ఉపాధి పనులను కల్పించాలని ఫీల్డ్ అసిస్టెంట్లను ఆదేశించారు. మస్టర్ల నిర్వహణ బాగులేదని, ఇలాగే కొనసాగితే ఫీల్డ్ అసిస్టెంట్లపై చర్యలు తప్పవని హెచ్చరించారు. కార్యక్రమంలో విజిలెన్స్ అధికారి డి.లవరాజు, క్వాలిటీ కంట్రోల్ అధికారి సతీష్ బాబు, ఎపిడి శ్రీనివా సరావు, ఎపిఒ శంకరరావు, ఇసి విష్ణుమూర్తి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న శ్రీనివాసరావు, ఎఎంసి చైర్మన్ సతీష్

పవన్ కళ్యాణ్ అన్నప్పుడు బాధ లేదా..?

ప్రజాశక్తి - పలాస

అల్లుడు గిల్లుడు అని, అల్లుడు టాక్స్ అని మెదట లేవనెత్తింది గత ఎన్నికల్లో జనసేన నాయకుడు పవన్ కళ్యాణ్ కాదా?, అప్పుడు ఖండించని నాయకులు రాష్ట్ర పశుసంవర్ధక శాఖ మంత్రి సీదిరి అప్పలరాజు అంటే ఎందుకంత బాధని వైసిపి నాయకులు, ఎఎంసి చైర్మన్ పి.వి.సతీష్, జిల్లా వర్తక విభాగం కార్యదర్శి బెల్లాల శ్రీనివాస్, కాశీబుగ్గ వైశ్య సంఘ కార్యదర్శి కోట్ని విజయ్, కొంచాడ రాజాశ్రీకాంత్, పెంట రత్నాకర్, తూముల శ్రీనివాసరావులు అన్నారు. కాశీబుగ్గ ప్రగతి భవన్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడుతూ గత ఎన్నికల్లో అల్లుడు గిల్లుడు అనేది తప్పుగా అన్నానని, నేడు మీ పొత్తులో ఉన్న పవన్ కళ్యాణ్‌తో చెప్పించగలరా అని ప్రశ్నించారు. గిల్లుడు అంటే పర్యాయపదం బాధపెట్టడం అని, వ్యాపారులకు గతంలో అల్లుడు ఎన్నో ఇబ్బందులకు గురిచేసిన సంఘటనలు ఉన్నాయన్నారు. వ్యక్తిగతంగా కక్షగట్టి కేసులు కట్టించిన సంఘటనలు ఉన్నాయని, అల్లుడు టార్గెట్ చేస్తే అవతల వ్యక్తి నాశనమే అనేది ఆయా నాయకులే బహిరంగంగా చెప్పిన సంఘటనలు ఉన్నాయన్నారు. విద్యాసంస్థ పక్కన పెట్రోల్ బంక్ ఏర్పాటుకు శివాజి అంగీకరించకపోవడంతో అల్లుడు వద్దకు బంకు యజమాని వెళ్లి అదే చోట పెట్టించుకున్నది నిజం కాదా అని ప్రశ్నించారు. అల్లుడు మాట వినకపోతే వ్యాపారుల ఇళ్లపై, ప్యాక్టరీలపై దాడులు చేయించిన ఘనత అల్లుడిది కాదా అని ప్రశ్నించారు. కెటిరోడ్ వంద అడుగుల విస్తరణకు అప్రూవల్ తెచ్చిన చేయించుకోలేకపోయారని, మంత్రి అప్పలరాజు అధికారకం చేపట్టిన తరువాత వ్యాపారులపై దాడులు కాని, వ్యక్తిగత కక్షలు కాని ట్యాక్స్‌లు కాని లేవని, వ్యాపారుల అందరి సహకారంతో నేడు విస్తరణ పనులు పూర్తి చేసి సుందరంగా తయారు చేయడం వలన నేడు ఎన్నో పెద్దపెద్ద వ్యాపార సంస్థలు పట్టణానికి వచ్చాయన్నారు. మంత్రి అప్పలరాజును మరోమారు గెలిపించుకొని వైశ్యులంతా వ్యాపార అభివృద్ధి సాధించే విధంగా ఆలోచనలు చేసుకోవాలని కోరారు.

మంత్రి సానుకూల స్పందన

రైల్వే మంత్రిని కలిసిన ప్రతినిధులు

వజ్రపుకొత్తూరు: దుర్గ్ నుంచి పలాస మీదుగా బెర్హంపూర్‌ల వరకు కొత్త రైలు ప్రారంభించే ందుకు కేంద్ర రైల్వే శాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ సానుకూలంగా స్పందించారని ఆంధ్ర ఉత్కళ్ సంఘర్ష్ సమితి అధ్యక్షుడు కర్రి ఉమాశంకనిరావు తెలిపారు. బడ్జెట్ సమావేశాల సందర్భంగా న్యూఢిల్లీలో రైల్ భవన్‌లో మంగళవారం దుర్గ్ లోక్‌సభ ఎంపీ విజయ్ బఘెల్‌తో కలిసి కేంద్ర రైల్వే మంత్రిని కలిశామని ఆయన తెలిపారు. దుర్గ్ నుంచి పలాస మీదుగా బెర్హంపూర్ వరకు సుమారు 722 కిలోమీటర్ల దూరాన్ని ప్రయాణం చేయడానికి మూడు రైళ్లను మారాల్సి రావడంతో వృద్ధులు, మహిళలు, చిన్నారులు పడుతున్న ఇబ్బందులను మంత్రి దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఈ సందర్భంగా రైల్వేమంత్రి మాట్లాడుతూ రైలు ప్రారంభించేందుకు అంగీకారం తెలిపారని ఆయన తెలిపారు. దీంతో దుర్గ్, భిలాయ్, చరోడా, కుమ్హారి, రాయ్‌పూర్, కోస్తా ఆంధ్రప్రదేశ్, ఒరిస్సా రాష్ట్రాల ప్రజలకు రైలు ప్రయాణ సౌకర్యం అందుబాటులోకి వస్తుందని తెలిపారు. ఈయనతో పాటు డాక్టర్ ఎస్.ఆదినారాయణ్, ఎల్.శ్రీనివాసరావు, బి.రాజేంద్రప్రసాద్, కె.చంద్రశేఖర్, రోషన్ తామ్రాకర్, సౌరభ్ చౌబె పాల్గొన్నారు.

గ్రామీణ బంద్‌ను విజయవంతం చేయాలి

ప్రజాశక్తి - పలాస

కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక, రైతాంగ, ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 16న చేపట్టే గ్రామీణ బంద్, పారిశ్రామిక సమ్మెను విజయవంతం చేయాలని ఎపి రైతుసంఘం రాష్ట్ర ఉపాధ్యక్షులు కె.మోహనరావు, సిపిఐ నాయకులు చాపర వేణుగోపాల్, ఎఐకెఎం జిల్లా నాయకులు మద్దిల రామారావు, సిపిఐ ఎంఎల్ లిబరేషన్ రాష్ట్ర నాయకులు తామాడ సన్యాసిరావు పిలుపునిచ్చారు. కాశీబుగ్గలోని సిపిఐ కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ప్రజలపై భారాలు వేస్తూ కార్పొరేట్లకు రాయితీలు ఇస్తున్నాయని విమర్శించారు. ప్రజాధనంతో నిర్మించిన రైల్వే, టెలికాం, పోస్టల్, ఇన్సూరెన్స్, బ్యాంకులు, ఆయిల్ సెక్టార్, విద్యుత్, రోడ్లు, పోర్టులు తదితర ప్రభుత్వరంగ సంస్థలను కార్పొరేట్లకు ధారాదత్తం చేస్తున్నాయన్నారు. కార్పొరేట్ కంపెనీల యజమానులకు ఆటంకంగా ఉన్న కార్మిక చట్టాలను రద్దు చేసి కార్మికులకు అన్యాయం చేసిందని విమర్శించారు. బిజెపి ప్రభుత్వ విధానాల వల్ల అంబానీ, అదానీ ప్రపంచ కుబేరుల జాబితాలో చేరగా... పేద, కౌలు రైతులు, వ్యవసాయ కార్మికులు సుమారు 1.50 లక్షల మంది ఆత్మహత్యలు చేసుకున్నారని చెప్పారు. బిజెపి ప్రభుత్వం ప్రత్యేక హోదా, విభజన హామీలు అమలు చేయకుండా రాష్ట్రానికి తీరని ద్రోహం చేసిందని విమర్శించారు. 16న చేపడుతున్న బంద్, సమ్మెలో ప్రజలు భాగస్వామ్యం కావాలని విజ్ఞప్తి చేశారు. సమావేశంలో సిఐటియు నాయకులు ఎన్.గణపతి, న్యూడెమోక్రసీ నాయకులు జి.బాలకృష్ణ, పిడిఎస్‌యు నాయకులు ఎం.వినోద్ కుమార్, పి.కుసుమ, పి.నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న మోహనరావు

పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న యుటిఎఫ్ నాయకులు

ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి - కొత్తూరు

ఆంధ్రప్రదేశ్ ఐక్య ఉపాధ్యాయ ఫెడరేషన్ ఆధ్వర్యంలో ఓటు ఫర్ ఒపియస్ పోస్టర్‌ను మంగళవారం ఆడవి కొత్తూరు ఎంపిపి పాఠశాలలో ఆవిష్కరించారు. జిల్లా కార్యదర్శి బోడ శ్రీను, రాష్ట్ర సోషల్ మీడియా కన్వీనర్ దండు ప్రకాశరావు, యుటిఎఫ్ సీనియర్ కార్యకర్త ఆర్.ఆర్.ఎం కొండలరావు పోస్టర్ ఆవిష్కరించారు. కార్యక్రమంలో అధ్యక్షులు శోభన్‌బాబు, ప్రధాన కార్యదర్శి విజయకుమార్, రమణయ్య, అనంతరావు, రవికుమార్, సీతారాం, కృష్ణ, ప్రసాద్, భరత్, రమేష్, రాజారావు, తిరుపతిరావు, ధనుంజయరావు పాల్గొన్నారు.

మార్షల్ ఆర్ట్స్‌లో బంగారు పతకం

ప్రజాశక్తి - సోంపేట

మండలం మామిడిపల్లి గ్రామానికి చెందిన ఆడ కిరణ్ కుమారి ఇటీవల కాకినాడలో జరిగిన ఆంధ్రప్రదేశ్ మార్షల్ ఆర్ట్స్ ఛాంపియన్ షిప్‌లో బంగారు పతకం కైవసం చేసుకొంది. ఈ మేరకు ఆమెను తండ్రి సూర్యనారాయణ, కోచ్ లోకనాథంతో పాటు స్థానిక పెద్దలు అభినందించారు. 2024 ఛాంపియన్ షిప్ వ్యక్తిగత విభాగంలో కిరణ్‌కుమారి బంగారు పతకం సాధించింది. భవిష్యత్‌లో మరిన్ని విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు.

మాట్లాడుతున్న సిడిపిఒ గీత

బాలలను రక్షించుకుందాం

ప్రజాశక్తి - బూర్జ

బాలలను రక్షించుకోవాల్సిన అవసరం ప్రతిఒక్కరిపై ఉందని జిల్లా బాలల రక్షణ విభాగం అధికారి మల్లేశ్వరరావు అన్నారు. మంగళవారం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో పలు అంశాలపై ఒక్కరోజు నిర్వహించిన సమావేశంలో పాల్గొన్నారు. బాలలరక్షణ కోసం, బాలలపై జరుగుతున్న లైంగిక నేరాలు, బాల్య వివాహాలు, గర్భస్థ లింగ నిర్ధారణ తదితర అంశాలపై శిక్షణను నిర్వహించారు. ప్రభుత్వం బాలల రక్షణ కోసం ఇతర అంశాలపై ఎన్నో జిఒలు విడుదల చేయడం జరిగిందన్నారు. ప్రస్తుతం 31 జిఒ ఇటీవల విడుదల చేయడం జరిగిందన్నారు. గ్రామాల్లో అవగాహన లేక బాల్యవివాహాలను జరుపుతున్నారన్నారు. ఎంపిడిఒ రవీంద్రబాబు ఆధ్వర్యంలో నిర్వహించిన సమావేశంలో జెడ్‌పిటిసి బి.రామారావు, సిడిపిఒ గీత, సోషల్ వర్కర్ ఐ.జనార్ధన, ఎపిఎం బాబురావు, ఎంఇఒ ధనుంజయ రావు, చైల్డ్ హెల్ప్ లైన్ ప్రతినిధి రాజు, సూపర్‌వైజర్లు రత్నాంజలి, జానకి రత్నాలు పాల్గొన్నారు.

మాట్లాడుతున్న సింహాచలం

ఉపాధి హామీకి కేంద్రం తూట్లు

ప్రజాశక్తి - గార

దేశవ్యాప్తంగా పేదలకు ప్రయోజనం చేకూర్చడానికి పోరాడి సాధించుకున్న ఉపాధిహామీ చట్టాన్ని కేంద్రంలో ఉన్న నరేంద్రమోడీ ప్రభుత్వం నీరుగార్చేందుకు కుట్ర చేస్తోందని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి గంగరావు సింహాచలం విమర్శించారు. గార మండలం చల్లపేటలో ఉపాధి పనులు జరుగుతున్న పని ప్రదేశం వద్ద కూలీలతో మాట్లాడారు. కార్పొరేట్లకు రూ.వేల కోట్లు దోచిపెడుతున్నారని, సామాన్యుల పట్ల మాత్రం కర్కసంగా వ్యవహరిస్తున్నారన్నారు. పేద ప్రజలకు ఎంతో కొంత అండగా ఉన్న గ్రామీణ ఉపాధి హామీ చట్టంపై పదే పదే దాడులు చేస్తూ బడ్జెట్‌లో కోతలు పెడుతున్నారన్నారు. సమావేశంలో చల్ల అనురాధ, బాకి లక్ష్మి, బాకి అప్పయ్య, అప్పారావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైద్యాధికారి పావని

అవగాహన కల్పించాలి

బూర్జ: రానున్న వేసవికాలం తీవ్రతపై ప్రజలకు ఆశా కార్యకర్తలు అవగాహన కల్పించాలని వైద్యాధికారి రాజశేఖర్ సూచించారు. మంగళవారం స్థానిక పిహెచ్‌సిలో ఆశా కార్యకర్తలతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. వేసవి తాపంతో ప్రజలు వడదెబ్బకు గురయ్యే అవకాశం ఉందని, తద్వారా ప్రాణాలు కోల్పోయే సంఘటనలు ఉన్నాయన్నారు. పది గంటలు దాటిన తర్వాత బయటకు రాకూడదని, అత్యవసరంగా వచ్చినవారు ఎండ నుంచి ఉపశమనం పొందేందుకు గొడుగు, చెప్పులు, నీళ్ల బాటిల్‌ను తీసుకువచ్చేలా అవగాహన కల్పించాలన్నారు. ముఖ్యంగా గర్భిణీల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలన్నారు. సమావేశంలో వైద్యాధికారిని పావని, సిహెచ్ఒ మురళి, హెల్త్ సూపర్‌వైజర్ సరోజిని, సిబ్బంది, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

సకాలంలో రుణాలు చెల్లించాలి

ఇచ్ఛాపురం: స్వయంశక్తి సంఘాలు తీసుకున్న రుణాలు సకాలంలో చెల్లింపునకు చర్యలు తీసుకోవాలని వెలుగు ఎపిఎం ప్రసాదరావు సూచించారు. మంగళవారం మండల మహిళా సమైక్య సమావేశం నిర్వహించారు. ప్రధానంగా స్వయం శక్తి సంఘాల గ్రేడింగ్, మొబైల్ బుక్ కీపింగ్, ఆన్‌లైన్ అకౌంటింగ్, వైఎస్ఆర్ ఆసరా, చేయూత, జగనన్న తోడు, పెరటి తోటల పెంపకం, ప్రకృతి వ్యవసాయంపై సమీక్ష నిర్వహించి పలు సూచనలు చేశారు. అదేవిధంగా సిబ్బంది పనితీరులో అలసత్వం వహిస్తే క్రమశిక్షణ చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ఉన్నతి రుణాల కార్యాచరణ ప్రణాళిక, మహిళా మార్ట్ ఏర్పాటు, ఆరోగ్యం, పోషణ, అయోడైజ్డ్ ఉప్పు ఉపయోగాలపై అవగాహన కల్పించారు. సమావేశంలో అధ్యక్షులు డి.పార్వతి, సిసిలు మోహనరావు, లక్ష్మి, అకౌంటెంట్ మోహిని, విష్ణుబాబు, గ్రామ సంఘాల అధ్యక్షులు, ఆరోగ్య పోషణ రిసోర్స్ పర్సన్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

'ఐతమ్' విద్యార్థులకు శిక్షణ

ప్రజాశక్తి - టెక్కలి రూరల్

ఆదిత్య ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అండ్ మేనేజ్మెంట్ ఇంజనీరింగ్ కళాశాలకు చెందిన 217 మంది సిఎస్ఇ ద్వితీయ ఏడాది విద్యార్థులకు జనవరి 22 నుంచి ఫిబ్రవరి 10 వరకు 'డేటా ఎనలైసిస్ యూజింగ్ పైతాన్' అనే అంశంపై శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నట్టు కళాశాల డైరెక్టర్ ప్రొఫెసర్ వి.వి.నాగేశ్వరరావు ప్రకటనలో తెలిపారు. ఎక్స్పోజర్ డేటా మేనిపులేషన్ యూజింగ్ షేప్, ఎక్స్పోజర్స్ డేటా ఎనలైసిస్ యూజింగ్ పండాస్, క్లీనింగ్ యూజింగ్ పండాస్, ఎక్స్పోజర్స్ డేటా విజుయులైజేషన్ యూజింగ్ సీబోర్న్, విజుయులైజేషన్ యూజింగ్ మట్లెట్లెబ్ పైతాన్ అనే అంశాలపై శిక్షణ పొందడం వలన ఆయా రంగాల్లో ఉపాధి, ఉద్యోగ అవకాశాలు విద్యార్థులకు మెండుగా కలుగుతాయన్నారు. ఈ తరగతులకు ఎపిఎస్ఎస్‌ఎసి నుంచి టి.శ్రీకణ్య ప్రత్యేక శిక్షకులుగా హాజరుకాగా ప్రిన్సిపాల్ డాక్టర్ ఎ.ఎస్.శ్రీనివాసరావు, హెచ్‌ఐడి డాక్టర్ యు.డి.ప్రసన్న, ఎపిఎస్ఎసిడిసి స్పాక్ డాక్టర్ వి. అశోక్ కుమార్, డిపార్ట్మెంట్ కో-ఆర్డినేటర్ జి.సూర్యపవన్ కుమార్, సిఎస్స్ సెక్షన్ కో-ఆర్డినేటర్ కె.బి. అనూషల పర్యవేక్షణలో నిర్వహించ బడుతున్నాయని పేర్కొన్నారు.

మధును సత్కరిస్తున్న పులఖండం శ్రీనివాసరావు

'గాయత్రి' అధ్యాపకునికి డాక్టరేట్

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

గాయత్రి కాలేజ్ ఆఫ్ సైన్స్ అండ్ మేనేజ్‌మెంట్ కళాశాలలో కామర్స్ విభాగం అధ్యాపకులు నడిమింటి మధుకు ఆంధ్ర విశ్వవిద్యాలయం నుంచి కామర్స్ పరిశోధనకు గాను డాక్టరేట్ లభించింది. ఈమేరకు విశ్వవిద్యాలయం నుంచి ఆయన డాక్టరేటు పట్టా పొందారు. ఈ సందర్భంగా మంగళవారం ఆయనకు కళాశాల ప్రిన్సిపాల్ డా.పులఖండం శ్రీనివాసరావు, గురజాడ విద్యా సంస్థల అధినేత జి.వి.స్వామి నాయుడు సత్కరించారు. కార్యక్రమంలో మేనేజ్‌మెంట్ విభాగాధిపతి వంగ మహేష్, బాలాజీ, గీత, అప్పల నాయుడు, విద్యార్థుల కో-ఆర్డినేటర్ పొడుగు చరణ్, కృష్ణ, మణికంఠ పాల్గొన్నారు.

మంచినీటి బోరును ప్రారంభిస్తున్న చైర్‌పర్సన్ విజయ

గ్రామాలు అభివృద్ధి

కవిటి: ఇచ్ఛాపురం నియోజకవర్గంలో ప్రతిపల్లెలో తమ ప్రభుత్వం అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టినట్టు జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచుల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు తెలిపారు. మండలం కవిటి పంచాయతీ, దూగానపుట్టుగ పంచాయతీల్లో శుక్రవారం పలు శంకుస్థాపనలు, ప్రారంభోత్సవ కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు రూ.20 లక్షల నిధులు కేటాయించి కార్యక్రమాలు చేపట్టినట్టు తెలిపారు. వైసిపి ప్రభుత్వం పూర్తిస్థాయిలో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసిందని తెలిపారు. మరోసారి ఆదరించి ఆశీర్వదించాలని కోరారు. కార్యక్రమంలో వైసిపి నాయకులు దూగాన భద్రాచలం, ఎస్‌పి నారాయణ స్వామి, పాండవ శేఖర్, కర్రి గోపయ్య, యలమంచి నీలయ్య, బద్రి ప్రకాష్, ఎన్ని అశోక్, నర్తు శివాజీ, సతీష్, బి.మురళీ, డి.ధర్మారావు పాల్గొన్నారు.

సిసి రోడ్డు పనులు ప్రారంభం

నరసన్నపేట: పట్టణంలో మారుతీనగర్-1(శ్రీదేవీ టాకీస్) వద్ద సుమారు రూ.2 లక్షలు పంచాయతీ నిధులతో సిసి రోడ్డు పనులకు మంగళవారం సర్పంచ్ బి.శంకర్ ప్రారంభించారు. అలాగే వజ్రంపేట వీధిలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో గుర్తించిన రహదారికి రూ.8లక్షలతో సిసి రోడ్డు పనులు ప్రారంభించారు. ఈ పనులను వేగంగా పూర్తిచేయాలని సర్పంచ్ గుత్తేదారులకు సూచించారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ సాసుపల్లి కృష్ణబాబు, వార్డు మెంబర్లు రఘుపాత్రుని శ్రీధర్, వండాన లక్ష్మణరావు, చీపురు నారాయణరావు, పట్ట జగ్గుబాబు, బాలరాజు తదితరులు పాల్గొన్నారు.

జ్ఞాపికను స్వీకరిస్తున్న డిఐజి రవికిరణ్

జైళ్ల శాఖ డిఐజి అరసవల్లి సందర్శన

ప్రజాశక్తి - శ్రీకాకుళం అర్బన్

అరసవల్లి శ్రీ సూర్యనారాయణ స్వామి ఆలయాన్ని మంగళవారం రాజమండ్రిలో ఉన్న కోస్తా ఆంధ్ర రేంజ్ జైళ్ల శాఖ డిఐజి ఎం.ఆర్. రవి కిరణ్ సందర్శించారు. ఆయనకు ఆలయ ప్రధాన అర్చకులు ఇప్పిలి శంకర శర్మ ఆలయ సాంప్రదాయ బద్ధంగా స్వాగతం పలికారు. ఆలయంలో స్వామివారి సేవల్లో పాల్గొన్న అనంతరం ఆలయ ప్రాంగణంలోని అనివేటి మండపంలో స్వామివారి శేష వస్త్రాలను కప్పి జ్ఞాపికను ఆలయ ఇఒ వి.హరి సూర్యప్రకాష్ అందజేశారు. ఆయనతో పాటు జిల్లా జైళ్ల శాఖాధికారి ఎస్.ఉదయ భాస్కరరావు హాజరయ్యారు. అలాగే నగరానికి చెందిన వి.జగన్నాథం ఆలయంలో నిర్వహిస్తున్న శాశ్వత అన్నదాన పథకానికి రూ.లక్ష విరాళంగా అందజేశారు. ఆలయాన్ని సందర్శించిన ఆయన చెక్కును సీనియర్ సమాయకులు బిఎస్ చక్రవర్తికి అందజేశారు.

సంక్షేమ పథకాలను వివరిస్తున్న నాయకులు

గడప గడపకు సంక్షేమం

కవిటి: రాష్ట్ర వ్యాప్తంగా గడప గడపకు సంక్షేమ పథకాలను అందించిన ఘనత సిఎం జగన్మోహన్ రెడ్డిదని జెడ్‌పి చైర్‌పర్సన్ పిరియా విజయ, ఎంపిపి ప్రతినిధి కడియాల ప్రకాష్, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షుడు పూడి లక్ష్మణరావు కొనియాడారు. మండలం కవిటిలో శుక్రవారం గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బడుగు బలహీనవర్గాల అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తున్నట్టు తెలిపారు. ముఖ్యంగా వాలంటీర్లు, సచివాలయ వ్యవస్థతో రాష్ట్రంలో నూతన ఒరవడి సృష్టించారన్నారు. అనంతరం ఇంటింటికీ వెళ్లి మరోసారి వైసిపిని ఆదరించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు పూడి నీలాచలం, బెందాలం జయ ప్రకాష్, పాండవ శేఖర్, ఎస్‌పి నారాయణ స్వామి, దువ్వు కృష్ణారెడ్డి, కర్రి గోపయ్య, దుగాన భద్రాచలం, ఎన్ని అశోక్, బర్ల నాగభూషణం, డి.ధర్మారావు, దుర్యోధన పాల్గొన్నారు.

ఒడిశా బృందం పరిశీలన

రణస్థలం: మండలంలోని బంటుపల్లిలో మంగళవారం ఒడిషా రాష్ట్ర బృందం 50 మంది రైతులు క్షేత్ర పరిశీలన చేశారు. స్థానిక రైతు వెలిసేటి అరుణవాసురావు ప్రధాన పంట పామాయిల్‌లో అంతర పంటలుగా బొప్పాయి, వంగ, టమాటో, అరటి పంటలను, అలాగే కలుపు నివారణ నత్రజని నిమిత్తం పెసర, మినప పంటలను పరిశీలించారు. అలాగే ప్రకృతి వ్యవసాయ పద్ధతుల్లో ప్రతి 15 రోజులకు ఒకసారి ఎకరాకు 200 లీటర్ల జీవామృతం, బొప్పాయిలో వైరస్ తెగులు నివారణ నిమిత్తం పేడ మూత్ర ఇంగువ ద్రావణం పిచికారి చేయడం జరిగిందని, తద్వారా ఆరోగ్యంగా ఉందని రైతు వెలిసేటి అరుణ వాసురావు బృందం సభ్యులకు వివరించారు. అలాగే ముక్తుంపురంలో పచ్చిపాల లక్ష్మి ఎటిఎం మోడల్, కొంచాడ అప్పలనాయుడు కూరగాయల్లో వేసిన పలు పంటలను పరిశీలించారు. కార్యక్రమంలో ఒరియా ట్రాన్స్లేటర్ కృపాసింధ్, ఎన్ఎఫ్ఎ గోవింద్ రెడ్డి, మాస్టర్ ట్రైనర్ కంబవు కృష్ణ, రణస్థలం మండల ప్రకృతి వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

పంటలు పరిశీలిస్తున్న ఒడిశా రాష్ట్ర బృందం

నీటి సమస్య తీర్చాలి

ప్రజాశక్తి - మెళియాపుట్టి

మండలం గేదలు పోలూరు గిరిజన గ్రామస్తుల తాగునీటి సమస్య అధికంగా ఉందని జిల్లా డిఎల్ఓ అధ్యక్షుడు సవర కుమార్ అన్నారు. మంగళవారం ఎంపిడిఒ కొండలరావుకు వినతపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామానికి చెందిన గిరిజనులకు కొంతకాలంగా తాగునీటి సమస్య వెంటాడుతుందని, పక్క గ్రామమైన దినబంధపురం నుంచి పైపులైన్ ద్వారా అందిస్తున్నా సమయానికి నీరు రావడం లేదన్నారు. వేసవికాలం వచ్చిందంటే తాగునీటి సమస్య అధికంగా ఉంటుందని సమస్యను పంచాయతీ కార్యదర్శికి చెప్పినా పరిష్కారం కాలేదన్నారు. ప్రజలు తాగునీరు లేక అనేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. తమకు తాగునీరు సదుపాయం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా డిఎల్ఓ సభ్యులు సవర రాము, సవర ప్రసాద్, సవర చలపతి, సవర వెంకటేష్, మహిళలు పాల్గొన్నారు.

ఎంపిడిఒకు వినతిపత్రం అందజేస్తున్న కుమార్, గ్రామస్తులు

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

ప్రజాశక్తి - సరుబుజ్జిలి

ఆమదాలవలస సర్కిల్ పరిధిలో ద్విచక్ర వాహనాలు కొనుగోలు చేసే వ్యక్తులు అప్రమత్తంగా ఉండాలని సర్కిల్ ఇన్‌స్పెక్టర్ గొంప దివాకర్ వాయునందన యాదవ్ తెలిపారు. మంగళవారం సరుబుజ్జిలి పోలీస్ స్టేషన్ పరిధిలో మూల సవళాపురంలో తెల్లవారుజామున నాలుగు గంటల నుంచి ఏడు గంటల వరకు సిఐ వాయునందన్ ఆధ్వర్యంలో పొందూరు, సరుబుజ్జిలి ఎస్ఐలు రవికుమార్, బి.నిహార్‌లు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇంటింటికి వెళ్లి సోదాలు నిర్వహించి ద్విచక్ర వాహనాల పత్రాలను పరిశీలించారు. 9 ద్విచక్ర వాహనాలకు ఎటువంటి పత్రాలు వాహన యజమానులు చూపకపోవడంతో ద్విచక్ర వాహనాలను సరుబుజ్జిలి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ ఎవరైనా పాత ద్విచక్ర వాహనాలు కొనేటప్పుడు దొంగతనాలు చేసే వ్యక్తుల నుంచి కొనవద్దని, అలాగే వాహనాలతో పాటు పత్రాలను క్షుణ్ణంగా పరిశీలించి కొనుగోలు చేయాలని ప్రజలకు సూచించారు. ద్విచక్ర వాహనాలను ఇతర వ్యక్తులకు ఇవ్వకూడదని, ఏదైనా ప్రమాదం జరిగితే పత్రాలు ఎవరి పేరు మీద ఉంటే వారే శిక్షార్హులు అవుతారన్నారు. ప్రతిఒక్కరు బాధ్యతగా మెలగాలన్నారు. కార్యక్రమంలో ఎఎస్ఐ చంద్రనాయుడు, హెచ్‌సి రవిశంకర్, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

ప్రజలకు అవగాహన కల్పిస్తున్న సిఐ

వివాహిత ఆందోళన

ప్రజాశక్తి - కోటబొమ్మాళి

ఇటీవల మనవరాలిపై అత్యాచారానికి పాల్పడ్డాడంటూ ఆరోపణల ఎదుర్కొంటూ జిల్లా సబ్ జైల్లో రిమాండ్ ఖైదీగా ఉన్న మండలం కొత్తపేటకు చెందిన కోరాడ ప్రసాద్ కోడలు వసంత వారి కుల పెద్ద కోటబొమ్మాళికి చెందిన పైడిశెట్టి రాంకుమార్ ఇంటి ముందు మంగళవారం ఆందోళన చేపట్టారు. తన మామ ప్రసాద్ తనకు వివాహం అయినప్పటి నుంచి తనకు శారీరక వేధింపులకు గురిచేస్తున్నాడని, భరిస్తూ వస్తున్నప్పటికీ తాజాగా ఇటీవల తన కుమార్తెపై కూడా అత్యాచారానికి పాల్పడ్డాడని, ఈ నేపథ్యంలోనే ప్రస్తుతం రిమాండ్‌లో ఉన్నాడని అయితే తనకు బెయిల్ పెట్టేందుకు డబ్బులు అవసరం ఉందని, ఇంట్లో బంగారం ఇవ్వాలని తన భర్త సురేష్ తనను చితకబాదుతున్నాడని వివరించింది. అయితే ఏ విషయమైనా మా కులపెద్ద పైడిశెట్టి రాంకుమార్‌కు చెప్పకుండా చేయడని, ఇప్పుడు కూడా తనపై వేధింపులకు బాధ్యత రాంకుమార్‌దేనని ఆరోపిస్తూ అందుకే ఇక్కడ నిరసన చేసేందుకు వచ్చానని వసంత స్పష్టం చేసింది. అయితే తన ఇంట్లో 40 తులాల బంగారం పోయినట్లు తన భర్త సురేష్ అందరికీ చెబుతున్నారని, ఇంట్లో బంగారం పోలేదని, అది బయట ఉంటే నా భర్త ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తాడని, ఈ బంగారం భద్రపరిచానని, తన వద్దనే ఉందని వసంత స్పష్టం చేసింది. తమ బతుకులు ఛిద్రం చేస్తున్న ప్రసాద్ బెయిల్ కోసమైతే తన బంగారం ఇవ్వాల్సిన అవసరం లేదని అమె తెలిపారు. అయితే పక్క ఇంట్లో ఉన్న స్థానిక టిడిపి నేత బోయిన గోవిందరాజులు బయట జరుగుతున్న హడావిడిని గుర్తించి బయటకు వచ్చి పరిస్థితిని అడిగి తెలుసుకొని సర్ది చెప్పడంతో సమస్య సద్దుమణిగింది.

రహదారుల అభివృద్ధికి చర్యలు

ప్రజాశక్తి - సోంపేట

పట్టణంలో శ్రీ కోదండ రామస్వామి ఆలయం నుంచి మంగళవీధి జంక్షన్ వరకు సిసి రోడ్డు నిర్మాణ పనులను ఎంపిపి నిమ్మన దాసు మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూర్బన్ నిధులు రూ.40 లక్షలతో ఈ రోడ్డు పనులు చేపడుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సర్పంచ్ నగరి ప్రభావతి, నాయకులు పొడుగు కామేష్, కూర్మారావు, సిర్మా, నెహ్రూ, గిరిబాబు లోకనాథం, భీమా, వెంకన్న పాల్గొన్నారు.

డీలర్ల సమస్యలు పరిష్కరించాలి

ప్రజాశక్తి - టెక్కలి

మండలంలో ఉన్న చౌకధరల దుకాణ డీలర్లు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని డీలర్ల సంఘ అధ్యక్షులు కిమిడి శ్రీనివాసరావు తహశీల్దార్ ఆర్.బాలమురళీ కృష్ణను మంగళవారం కలిసి వినతిపత్రం అందించారు. డీలర్ల సమస్యలు పరిష్కారం కోసం పలుమార్లు ప్రభుత్వాన్ని కోరామన్నారు. ప్రస్తుతం అందిస్తున్న వాహనాల ద్వారా సరుకులు అందించే క్రమంలో లబ్దిదారుల నుంచి వేలిముద్రలు సమస్య వేధిస్తున్న కారణంగా సరుకులు అందించడంలో తలెత్తుతున్న ఇబ్బందులను తొలగించాలని కోరారు.

టిడిపి గెలుపే లక్ష్యంగా పనిచేయాలి

ప్రజాశక్తి - పలాస

టిడిపి గెలుపే లక్ష్యంగా పని చేయాలని రాష్ట్ర కార్యదర్శి వజ్జ బాబూరావు అన్నారు. మున్సిపాలిటీ పరిధి 26, 28 వార్డుల్లో పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైసిపి పాలనలో రాష్ట్రం అధోగతి పాలైందన్నారు. టిడిపి హయాంలో మున్సిపాలిటీ అభివృద్ధి చెందిందన్నారు. అనంతరం సూపర్ సిక్స్ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. కార్యక్రమంలో లోడగల కామేశ్వరరావు, గురుటిసూరి నారాయణ, సప్ప నవీను, పట్ట మల్లేష్, గాలి కృష్ణారావు, బడ్డ నాగరాజు, బోనెల బైరెగి, శంకర్, కొవ్వూరు సురేష్ పాల్గొన్నారు.

వజ్రపుకొత్తూరు: నగరంపల్లి, పెద్దబడాం గ్రామాల్లో పల్లెపల్లెకు తెలుగుదేశం కార్యక్రమం మండల టిడిపి అధ్యక్షుడు సూరాడ మోహనరావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సందర్భంగా పిఎసిఎస్ మాజీ చైర్మన్ దువ్వాడ హేమబాబు చౌదరి మాట్లాడుతూ రైతుల సమస్యలను గాలికి వదిలేసి మాటలతోనే పూటలు గడుపుతున్నారని విమర్శించారు. ఐదేళ్లుగా వంశధార శివారు భూములకు సాగునీరు అందక రైతులు పంటలు నష్టపోతుంటే పాలకులకు చీమకుట్టినట్లు కూడా లేదని ధ్వజమెత్తారు. కార్యక్రమంలో నాయకులు పి.సాంబమూర్తి, దువ్వాడ జయరాం చౌదరి, బి. శశిభూషణ్, ఎం. దుర్యోధనరెడ్డి, రామకృష్ణ, అప్పారావు పాల్గొన్నారు.

పోస్టర్‌ను పంపిణీ చేస్తున్న శేషగిరి

టిడిపితోనే అభివృద్ధి

ప్రజాశక్తి- టెక్కలి

ప్రజారంజకమైన పాలన ఒక్క టిడిపికే సాధ్యమని టిడిపి మండల అధ్యక్షులు బగాది శేషగిరి అన్నారు. మండలంలోని భూరగాం, నర్సింగపల్లి పంచాయతీ పరిధిలో పలు గ్రామాల్లో బాబు ష్యూరిటీ భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా మంగళవారం పర్యటించి ప్రజలతో మాట్లాడారు. వైసిపి పాలనలో అభివృద్ధి లేదన్నారు. సంక్షేమ పథకాల పేరుతో ప్రజా ధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారన్నారు. ఈ సందర్భంగా పోస్టర్లను పంపిణీ చేసారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు హనుమంతు రామకృష్ణ, పోలాకి షణ్ముఖరావు, మామిడి రాము, మెండ దమయంతి, దల్లి ప్రసాద్‌రెడ్డి, రెయ్యి ప్రీతీష్‌చంద్ పాల్గొన్నారు.

గుప్తాను అభినందిస్తున్న వాకర్స్ సభ్యులు

నడక ఉద్యమానికి గుర్తింపు గుప్తా

శ్రీకాకుళం అర్బన్ : జిల్లాలో నడక సంఘాలకు అంతర్జాతీయ స్థాయిలో ప్రత్యేక గౌరవం, గుర్తింపు తెచ్చిన మహోన్నత వ్యక్తుల్లో గుప్తా ఒకరని స్టార్ వాకర్స్ క్లబ్ సభ్యులు అన్నారు. మంగళవారం నగరంలో ఆర్ట్స్ కళాశాల ఆవరణలో స్టార్‌వాకర్స్ ఆధ్వర్యాన గుప్తా జన్మదిన వేడుకలను నిర్వహించారు. వాకర్స్ క్లబ్ ద్వారా అనేక రకాల సేవలందిస్తున్న ఆయన ఆరోగ్యవంతమైన జీవనం సాగించాలని వక్తలు అభిప్రాయడ్డారు. ఈ సందర్భంగా క్లబ్ అధ్యక్షుడు బెవర వెంకట రవిశంకర్ కేక్ కట్ చేసి ఆయనకు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వాకర్స్ సభ్యులు దేవీ ప్రసాద్, ఆర్.వి.ప్రసాద్, సంజీవరావు, ఉమామహేశ్వరరావు, గోలీ సంతోష్, ఐకెరావు పాల్గొన్నారు.

ప్రజల వద్దకే ధ్రువపత్రాలు

కొమరాడ : ప్రజలకు అవసరమైన ధ్రువపత్రాలు వారి ఇంటి వద్దకే వచ్చి అందజేస్తామని స్థానిక ప్రాథమిక వైద్యాధికారి అరుణ్‌కుమార్ అన్నారు. మండలంలోని కల్లికోటలో జగనన్న సురక్ష 2.0 కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. గ్రామాల్లో ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో ప్రజలకు వివిధ ఆరోగ్య తనిఖీలు నిర్వహించారు. అనంతరం దీర్ఘకాలంగా వ్యాధులతో బాధపడుతున్న రోగులకు ఆరోగ్య తనిఖీలు చేసి అవసరమైన మందులు పంపిణీ చేశారు. కార్యక్ర మంలో వైద్యులు పవన్, దుర్గాప్రసాద్, సిబ్బంది పాల్గొన్నారు.

పొగాకు నియంత్రణపై ప్రత్యేక డ్రైవ్

పాలకొండ : పొగాకు వాడకం నియంత్రణలో భాగంగా ఎన్‌సిడి ప్రోగ్రామ్ అధికారి డాక్టర్ దవల భాస్కరరావు పర్యవేక్షణలో ఎన్టీసీపీ స్వచ్ఛంద కార్యకర్త కె.భవాని పట్టణంలోని పలు దుకా ణాల్లో దాడులు నిర్వహించారు. కొందరి నుంచి సరకులు స్వాధీనం చేసుకొని రూ.వెయ్యి చొప్పున జరిమానా విధించారు. నెలకు రెండుసార్లు ప్రత్యేక డ్రైవ్‌లు చేపడతామన్నారు. ప్రభుత్వ, ప్రైవేటు విద్యాసంస్థల ఆవరణలో ధూమపానం చేయడం, పొగాకు ఉత్పత్తులు విక్రయించడం నేరమన్నారు. తనిఖీల్లో హెల్త్ విజిటర్ జె.రమణమ్మ, నత్తల కల్యాణ్‌ప్రసాద్, పోలీసులు పాల్గొన్నారు.

విద్యా ప్రమాణాలు మెరుగుపరిచేందుకే లిప్

వీరఘట్టం: వెనుకబడిన విద్యార్థులకు విద్యాప్రమాణాలు మెరుగుపర్చడమే లిప్ ఉద్దేశమని ఎంఇఒ డి.గౌరునాయుడు అన్నారు. సంత నర్సిపురం జిల్లా పరిషత్తు ఉన్నత పాఠశాల, చినగోర ఎంపియుపిఎస్, దశమంతపురం, కేజీబీవీ పాఠశాలలో వెనుకబడిన విద్యార్థుల కోసం హిందీ సబ్జెక్టు మినహా మిగిలిన ఐదు సబ్జెక్టులకు ఉపాధ్యాయుల ద్వారా ప్రత్యేక తరగతులు నిర్వహించనున్నట్లు తెలిపారు.

'చలపరాయి'కి తెలుగు వెలుగు కళారత్న

వినోద్ కుమార్‌ను సన్మానిస్తున్న సభ్యులు

ప్రజాశక్తి- కవిటి

శాస్త్రీయ సంగీతమైన మృదంగంలో అద్భుత ప్రతిభ కనబరుస్తున్న చలపరాయి వినోద్ కుమార్‌కు తెలుగు వెలుగు కళారత్న అవార్డు లభించింది. స్వామి వివేకానంద, సుభాస్ చంద్రబోస్ జయంతి ఉత్సవాల సందర్భంగా యువ చైతన్య వెల్ఫేర్ సొసైటీ, విశ్వకర్మ సేవా ఫౌండేషన్ సంయుక్తంగా ఈ అవార్డును అందజేశాయి. హనుమకొండలోని టిఎన్‌జిఒ భవనంలో జరిగిన ముగింపు ఉత్సవాల్లో వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కెఆర్ నాగరాజు, హనుమకొండ జెడ్‌పి చైర్మన్ డా మారేపల్లి సుదీర్ కుమార్ చేతులు మీదుగా వినోద్ కుమార్ కళారత్న అవార్డు అందుకున్నారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సాంస్కృతిక కార్యక్రమాల్లో కవిటి మండలం కపాసుకుద్ది గ్రామానికి చెందిన మాస్టర్ చలపరాయి సాయి చరణ్ తన మృదంగ విన్యాసంతో శ్రోతల్ని ఆకట్టుకున్నారు. అనంతరం చలపరాయి వినోద్ కుమార్‌తో పాటు సాయి చరణ్‌ను ఘనంగా సన్మానించారు. వినోద్ కుమార్ అవార్డు అందుకున్న సందర్భంగా సర్పంచ్ కాయ దమయంతి, భీమసేన్, గురువు మావూరి సత్యనారాయణ శర్మ, సూరి ప్రసాద్ శర్మ, బంకుపల్లి దుర్గా శ్రీనివాస్ శర్మ, దుంపల ఈశ్వరరావు, గణపతి శర్మ, మన్మదరావు అభినందనలు తెలిపారు.

పథకాలు అందించడం టిడిపికే సాధ్యం

కార్యకర్తలతో మాట్లాడుతున్న టిడిపి నాయకులు

ప్రజాశక్తి- కోటబొమ్మాళి

టిడిపి అధికారంలోకి రాగానే ప్రజలకు సూపర్ సిక్స్ పథకాలు అందించడం మాజీ సిఎం చంద్ర బాబునాయుడుకే సాధ్యమని మండల అధ్యక్షుడు బోయిన రమేష్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షుడు కింజరాపు హరివరప్రసాద్, మాజీ ఎంపిపిలు తర్ర రామకృష్ణ, వెలమల విజయలక్ష్మి, పూజారి శైలజ అన్నారు. మంగళవారం మండలం సౌడాం, నారాయణవలస పంచాయతీల్లో జనసేన నాయకులు పల్లి కోటేశ్వరరావు, టిడిపి నాయకులు, కార్యకర్తలతో ఆత్మీయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టిడిపిని ప్రజలు కోరుకుంటున్నారని, రాబోయే ఎన్నికల్లో వైసిపిని ఇంటికి పంపే రోజులు దగ్గరలోనే ఉన్నాయన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు పట్ట సింహాచలం, గొండు లక్ష్మణరావు, కర్రి అప్పారావు, శిమ్మ సింహాచలం, నంబాళ శ్రీనివాస్, బాడాన రమణమ్మ, సాసుమంతు ఆనందరావు పాల్గొన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

ప్రజాశక్తి- బూర్జ

భారీ వాహనాలు బెంబేలెత్తి స్తున్నాయి. అనునిత్యం శ్రీకాకుళం నుంచి పాలకొండకు వందలాది వాహనాలు రాకపోకలు సాగిస్తున్నాయి. ఇదే సమయంలో పరిమితికి మించి ట్రాక్టర్లతో గడ్డిని లోడ్ చేసుకుని వెళ్తున్నాయి. మరోవైపు ఊక లారీలు కూడా ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్నాయి. ప్రస్తుతం చెరుకు సీజన్ కావడంతో ట్రాక్టర్లపై ఒకేసారి చెరుకు మొత్తాన్ని వేయడంతో అవి బోల్తా పడుతున్నాయి. ఇప్పటికే ప్రమాదాలు జరిగిన సంఘటనలు ఉన్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి భారీలోడ్లుతో ప్రయాణం సాగిస్తున్న వాహనాలను అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని మండల ప్రజలతో పాటు వాహనదారులు కోరుతున్నారు.

తుడ్డలి జంక్షన్ వద్ద బోల్తా పడిన లారీ (ఫైల్)

టిడిపి, జనసేనతోనే అభివృద్ధి : శత్రుచర్ల

ప్రజాశక్తి - కురుపాం

రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే టిడిపి జనసేన కూటమి తోనే సాధ్యమని మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు అన్నారు. మండలంలో కిచ్చాడలో మంగళవారం బాబు షూరిటీ భవిష్యత్ గ్యారెంటీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయను మాట్లాడుతూ రాష్ట్రం అభివద్ధి చెంది ప్రజల భవిష్యత్తుకు భరోసా కావాలంటే చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని, కావున రానున్న ఎన్నికల్లో టిడిపి జనసేన ఉమ్మడి పార్టీ అభ్యర్థులకు గెలిపించడానికి ప్రజలంతా సిద్ధంగా ఉండాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలోటిడిపి రాష్ట్ర కార్యదర్శి వైరచర్ల వీరేశ్ చంద్ర దేవ్, నియోజకవర్గ ఇన్చార్జి టి. జగదీశ్వరి, మండల కన్వీనర్ కెవి కొండయ్య, నాయకులు చిలకల వెంకటరావు, జనసేన నాయకులు ఎన్. వంశీ పాల్గొన్నారు.

లక్కాయి గూడలో...

సభలో మాట్లాడుతున్న మాజీ మంత్రి శత్రుచర్ల విజయరామరాజు

సీతంపేట : మండలంలోని శిలగాం పంచాయతీ పరిధి లక్కాయిగూడలో పాలకొండ నియోజకవర్గ టిడిపి నాయకులు పడాల భూదేవి బాబు షూరిటీ-భవిష్యత్ గ్యారంటీ కార్యక్రమం నిర్వహించి ఇంటింటికీ వెళ్లి కరపత్రాలతో అవగాహన చేశారు. అలాగే సమావేశం లో టిడిపి అధికారంలోకి వస్తే అమలు చేయనున్న సూపర్ సిక్స్‌పై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు సవర అక్కరాజు, సవర సిమ్మయ్య, సవర గణేష్, మహిళలు, గ్రామస్తులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నేత్ర పరీక్షలు చేస్తున్న వైద్యులు

ఉచిత నేత్ర వైద్య శిబిరం

ప్రజాశక్తి- కవిటి

జాతీయ రహదారుల భద్రతా వారోత్సవాల్లో భాగంగా మండలం కరాపాడు టోల్ ప్లాజా ఆవరణలో మంగళవారం ఉచిత నేత్రవైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానికులు, వాహన చోదకులు, లారీ, ట్రాక్టర్ డ్రైవర్లకు ఉచిత నేత్ర వైద్యపరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి ఉచితంగా ఐడ్రాప్స్, కళ్ళద్దాలు పంపిణి చేశారు. కార్యక్రమంలో టోల్ ప్లాజా ప్రాజెక్ట్ మేనేజర్లు సెంథిల్ కుమార్, వివికెవి ప్రసాద్, మేనేజర్ జివి రమణారావు, శేఖర్ రాథోడ్, సేఫ్టీ మేనేజర్ కిరణ్ కుమార్, సంజయ్, ఇన్సిడెంట్ మేనేజర్ రవి కొప్పల, మైంటెనైన్స్ మేనేజర్ చిన్ని, రవికుమార్, ఎన్‌హెచ్‌ఎఐ ఆర్‌ఇ ఎస్‌పి సాహు, పారామెడికల్, టోల్ ప్లాజా సిబ్బంది పాల్గొన్నారు.

భూమిపూజ చేస్తున్న సర్పంచ్, ఎంపిటిసి ప్రతినిధులు

రోడ్డు పనులకు శంకుస్థాపన

ప్రజాశక్తి- వజ్రపుకొత్తూరు

బైపల్లి పెద్దనుయ్యి నుంచి అక్కుపల్లి శ్మశానవాటిక వరకు రూ.9లక్షలు జెడ్‌పి నిధులతో నిర్మించనున్న గ్రావెల్ రోడ్డుకు అక్కుపల్లి సర్పంచ్ ప్రతినిధి లండ రామలింగం, అక్కుపల్లి ఎంపిటిసి ప్రతినిధి మడ్డు రాంప్రసాద్ మంగళవారం భూమిపూజ చేసారు. కార్యక్రమంలో మడ్డు సుధీర్, మడ్డు సత్యం, కోనేరు కామేశ్వరరావు, పరుసుపల్లి చంద్రశేఖర్, బైపల్లి ధనరాజ్, కాస శేఖర్, లండ కృష్ణ, కాస వెంకటస్వామి, పిన్నాసి ధనరాజ్ పాల్గొన్నారు.

మాట్లాడుతున్న అప్పలసూర్యనారాయణ

అవినీతిపై ఓటు హక్కుతో పోరాడాలి

ప్రజాశక్తి- శ్రీకాకుళం అర్బన్

రాష్ట్రంలో ప్రస్తుత ప్రభుత్వం పెద్దఎత్తున అవినీతిని ప్రోత్సహిస్తూ రూ.లక్షల కోట్లు ప్రజాధనాన్ని కొల్లగొట్టారని, అటువంటి పాలకులను ఓటుహక్కు ద్వారా యువత తరిమి కొట్టాలని మాజీ మంత్రి గుండ అప్పలసూర్యనారాయణ పిలుపునిచ్చారు. మంగళవారం అరసవల్లిలో మాజీ ఎమ్మెల్యే గుండ లక్ష్మీదేవితో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రస్తుతం క్విడ్‌ప్రోకో, క్రోని క్యాప్టిలిజం ప్రజాస్వామ్యానికి భ్రష్టు పట్టించేవిగా తయారయ్యాయని, దీనిపై ప్రజల్లో విస్తృతంగా చర్చ జరగాలన్నారు.

ప్రచార రథం ప్రారంభం

ప్రజాశక్తి- మెళియాపుట్టి

మండలంలో తూముకొండ సమీపంలోని ఆకులమ్మతల్లి అమ్మవారి గుడి నుంచి రాష్ట్ర టిడిపి కార్యదర్శి కలమట సాగర్ మంగళవారం ఎన్నికలకు సంబంధించి ప్రచార రథం ప్రారంభించారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా హీరాపురంలో పర్యటించి టిడిపికి ప్రజలంతా సంపూర్ణ మద్దతివ్వాలని కోరారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు భాస్కర్ గౌడ, జిల్లా టిడిపి మహిళా ఉపాధ్యక్షురాలు బూర్ల లలిత కుమారి, ఎంపిటిసి ప్రతినిధి కదంబల పైడిరాజు, మండల తెలుగు యువత అధ్యక్షులు బసవ పరమేశ్వర్ రెడ్డి, మాలతి శ్రీధర్, వసంత్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.